
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

శనివారం । 26 । ఏప్రిల్ । 2025



సోమశిలలో 51.390 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో శుక్రవారానికి 51.390 టీఎంసీల నీరు ఉంది. దిగువన డెల్టా, ఉత్తర, దక్షిణ కాలువలకు 280 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.98,850
22 క్యారెట్లు ఆర్నమెంట్ (1 గ్రా)	రూ.8,982
3 శాతం జీఎస్టీతో	రూ.9,251
నవర (8 గ్రా)	రూ.74,008

గరిష్టం/కనిష్టం
38.6 /28.2

వాతావరణం

శనివారం జిల్లాలో అధిక ఉష్ణోగ్రతలు కొన సాగుతాయని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. గాలిలో తేమ శుక్రవారం 60 శాతంగా నమోదైంది.

ఎవడైతే నాకేంటి

ఎమ్మెల్యే X మంత్రి



పోలీసులు స్వాధీనం చేసుకున్న వాహనాలు

జిల్లా రాజకీయాల్లో తనదైన ముద్ర వేసుకున్న 'ఆనం'కే ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల ఝలక్ ఇచ్చారు. ఎవరైతే నాకేంటి.. నా నియోజకవర్గానికి నేనే ఎమ్మెల్యేను, నేనే మంత్రి..ఎవరి మాట వినాల్సిన అవసరం లేదన్నట్లుగా వ్యవహరించడంతో విభేదాలకు కుంపటి రాజేసినట్లు అయ్యింది. వింజమూరు మండలం నల్లగొండ్లలో అక్రమ గ్రావెల్ తరలింపు రవాణా వ్యవహారం ఎమ్మెల్యే, మంత్రికి మధ్య అగాధాన్ని సృష్టించింది.

- నల్లగొండ్ల గ్రావెల్ రవాణాదారుడు ఆనం అనుచరుడు
- కేసులు పెట్టొద్దని ఎమ్మెల్యేకు చెప్పినా బేఖాతరు
- అయినా నమోదు చేయించిన వైనం

సాక్షి టాస్క్‌ఫోర్స్: ఉదయగిరి నియోజకవర్గంలో సహజ వనరుల దోపిడీ స్థానిక ఎమ్మెల్యే కనుసన్నల్లో పతాక స్థాయికి చేరింది. మట్టి, గ్రావెల్, క్వార్ట్జ్, ఇసుక ఏదైనా సరే ఆయనకు కప్పం కట్టందే.. ట్రక్కు కూడా కదలని పరిస్థితి. తన వాటా చెల్లించకపోతే.. మనోడైనా.. పగోడైనా ఎవడైతే నాకేంటి అనే రీతిలో వ్యవహరిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే ఇటీవల జిల్లాకు చెందిన ఓ మంత్రి ముఖ్య అనుచరుడికే చుక్కలు చూపించాడు. గ్రావెల్, రఫ్ స్టోన్ రవాణా చేస్తున్న సదరు కాంట్రాక్టర్ వాహనాలను పోలీసుల ద్వారా నిలువరించారు. ఈ విషయంలో సదరు మంత్రి స్వయంగా ఫోన్ చేసి ఎమ్మెల్యేకి చెప్పినా వినిపించుకోలేదు.

మంత్రి అండతో భారీగా తరలింపు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అక్రమార్కుల ఆగడాలకు అంతేలేదు. ఇష్టానుసారంగా పేట్రేగిపోతున్నారు. అందిన మేరకు ప్రకృతి వనరులను కొల్లగొడుతున్నారు. ఈ క్రమంలో మంత్రి ముఖ్య అనుచరుడైన కాంట్రాక్టర్ ఆత్మకూరు నియోజవర్గంలో రూ.9 కోట్లతో రోడ్డు నిర్మాణ కాంట్రాక్ట్‌ను పొందాడు. ఈ రోడ్డు నిర్మాణానికి గ్రావెల్, రఫ్ స్టోన్ అవసరం కావడంతో సదరు కాంట్రాక్టర్ కన్ను వింజమూరు మండలం నల్లగొండ్ల సర్వే నంబరు 36 (పాత నంబరు) ఎల్‌పీఎం 2169లో 67.36 ఎకరాల ప్రభుత్వ భూమి మీద పడింది. ఇందులో నాణ్యమైన గ్రావెల్‌తోపాటు, రఫ్ స్టోన్ కూడా లభిస్తోంది. ప్రత్యేకంగా మెటల్ (కంకర) కొనుగోలు చేయకుండానే ఇక్కడి మెటల్ ఉపయోగపడుతుందని, దగ్గరగా ఉంటుందని సదరు కాంట్రాక్టర్ సంతోష పడ్డాడు. ఎలాంటి అనుమతులు తీసుకోకుండా, స్థానిక ఎమ్మెల్యేకు చెప్పకుండా కొన్ని నెలల నుంచి అప్పనంగా దోచేస్తున్నారు. ఇది ఎమ్మెల్యేకు తీవ్ర ఆగ్రహం తెప్పించింది. దీంతో ఎమ్మెల్యే ఆగమేఘాల మీద క్వారీల వద్దకు వెళ్లి తవ్వకాలను నిలిపివేసి, వాహనాలను అధికారులకు అప్పగించి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

కేసు నిలకడపై సందిగ్ధత

ఈ కేసులో ఒక వైపు మంత్రి, మరో వైపు ఎమ్మెల్యే ఉండడంతో కేసు దర్యాప్తు సజావుగా సాగేనా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. జిల్లాలో ఓ మాజీ మంత్రిపై అక్రమ గ్రావెల్ తరలింపు కేసు నమోదు చేసి రాజకీయ కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్న తరుణంలో ఈ వ్యవహారం ప్రస్తుతం జిల్లాలో హాట్ టాపిక్‌గా మారింది. స్వయంగా కూటమి ఎమ్మెల్యే అక్రమ గ్రావెల్ రవాణా వాహనాలను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. దీని వెనుక ప్రమేయం ఉన్న వారిని అరెస్ట్ చేసి కోర్టుకు పెట్టాలి. కానీ అలా జరుగుతుందా అనే దానిపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

మంత్రి చెప్పినా.. కేసులు కట్టించి..

ఈ వ్యవహారంపై సదరు కాంట్రాక్టర్ మంత్రి దృష్టికి తీసుకెళ్లడంతో ఆయనే స్వయంగా ఎమ్మెల్యేకు ఫోన్ చేసి కాంట్రాక్టర్ మనోడే వదిలేయాలని చెప్పడంతోపాటు మన పార్టీ నాయకుడిపైనే కేసులు పెడుతావా అంటూ అసహనం వ్యక్తం చేసినట్లు సమాచారం. మీ నియోజకవర్గంలో జరుగుతున్న ఇసుక, గ్రావెల్ ఇల్లీగల్ వ్యవహారంలో తాను జోక్యం చేసుకోవడం లేదు కదా! అంటూ ఈ విషయంలో జోక్యం చేసుకోవద్దని హెచ్చరించినట్లు తెలిసింది. ఎమ్మెల్యే ఆదేశాలతో వింజమూరు తహసీల్దార్ ఇచ్చిన రిపోర్టు మేరకు స్థానిక ఎస్సై తొమ్మిది వాహనాల యజమానులు, గ్రావెల్ తోలిస్తున్న వ్యక్తి, వాహనాల నడుపుతున్న డ్రైవర్లపై కేసు నమోదు చేశారు. ఈ వాహనాలు ప్రస్తుతం పోలీసుల ఆదుపులో ఉన్నాయి.

మైనింగ్ అధికారులవి కాకి లెక్కలేనా!

అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్న వ్యక్తి మంత్రి అనుచరుడు కావడం, ఎమ్మెల్యే సదరు వ్యక్తిపై సీరియస్‌గా ఉండడంతో మంత్రి కార్యాలయం వెంటనే రంగంలోకి దిగి మైనింగ్ అధికారులకు ఫోన్ చేసి కాస్త అనుకూలంగా నివేదిక ఇవ్వాల్సిందిగా ఒత్తిడి తెచ్చినట్లు తెలుస్తోంది. దీంతో జిల్లా మైనింగ్ అధికారి తాను రాకుండా తన కార్యాలయ సిబ్బందిని పంపించారు. భారీ స్థాయిలో గ్రావెల్, రఫ్ స్టోన్ తరలించి ఉన్నా, కేవలం 3500 క్యూబిక్ మీటర్లు మాత్రమే తవ్వకాలు జరిపినట్లు లెక్కలు తేల్చారు.



భూ రాబందులు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రభుత్వ స్థలాల్లో టీడీపీ నేతలు రాబందుల్లా వాలిపోతున్నారు. ఖరీదైన స్థలాలపై కన్నేసి రెవెన్యూ రికార్డులు తారుమారు చేసి విక్రయించుకుని జేబులు నింపుకొంటున్నారు. ప్రభుత్వ స్థలాలను కాపాడాల్సిన రెవెన్యూ, పోలీస్ అధికారులు అక్రమార్కులకు సహకరిస్తూ వాటాలు తీసుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. రాత్రికి రాత్రే ఆ స్థలాల్లో గదులు నిర్మాణం చేపట్టడం చూసిన జనాలు కంగుతిన్నారు.

ప్రధాన రహదారి పక్కనే రూ.5 కోట్ల స్థలం హాంఫట్

- ప్రభుత్వ భూమి రికార్డులు తారుమారు చేసి కబ్జా
- పోలీస్ అధికారి బంధువు పేరుతో మార్పిడి
- రాత్రికి రాత్రే గదుల నిర్మాణం

సాక్షి టాస్క్‌ఫోర్స్: కావలి– ముసునూరు మధ్య ప్రధాన రహదారి పక్కనే రూ.కోట్లు విలువైన ప్రభుత్వ స్థలాలు కనుమరుగై పోతున్నాయి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో కావలి సమీపంలో జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్, రామాయపట్నంలో పోర్టు నిర్మాణంతో చుట్టు పక్కల పరిసరాల్లో భూముల విలువలకు రెక్కలొచ్చాయి. పట్టణ పరిధిలో ప్రైవేట్ స్థలాలు దొరకడం గగనంగా మారింది. ఈ క్రమంలో కావలి– ముసునూరు మధ్య ప్రధాన రహదారి పక్కన కమర్షియల్ మార్కెట్ కాంప్లెక్స్‌లు విస్తరించాయి. ఇదే సమయంలో ప్రభుత్వ స్థలాలపై కూటమి నేతల కన్ను పడింది. ఆ స్థలాలపై టీడీపీ నేతలు రాబందుల్లా వాలిపోతున్నారు. తాజాగా ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి ఇంటికి కూతవేటు దూరంలో ఆక్రమణలు చేసి విక్రయించుకుంటున్నారు. కావలి మున్సిపాలిటీ పరిధిలో ప్రధాన రహదారి వెంబడి ముసునూరులోని అయ్యప్పగుడి వద్ద ఖరీదైన స్థలాన్ని పలువురు రాజకీయ దళారులు కాజేశారు. సర్వే నంబర్ 911-1, 2, 3 భిన్నాల్లో ప్రభుత్వ అనాధీనం, పోరంబోకు భూమిగా రెవెన్యూ రికార్డుల్లో నమోదైంది. ఆ సర్వే నంబర్‌లో ఉన్న దాదాపు 150 అంకణాలు రూ.5 కోట్లు విలువ చేసే స్థలాన్ని కొందరు రాజకీయ నాయకులు రెవెన్యూ రికార్డులనే తారు మారు చేసి విక్రయించడం కలకలం రేపుతోంది.



Adangal

సర్వే నెం : 911-2 పూర్తి విస్తీర్ణం : 12.97
సాగుకు పనికి రాని విస్తీర్ణం : 0.0
సాగుకు పనికి వచ్చు విస్తీర్ణం : 12.97
భూమి స్వభావం : ప్రభుత్వము
శిస్తు (రూ.) : 0.0 భూమి వివరణ : పోరంబోకు
జల ధారము : unknown ఆయకట్టు విస్తీర్ణం : 0.0
ఖాతా నెంబరు : 600000
అనుభవదారుని విస్తీర్ణం (ఎకరాలు-సెంట్లు) : 12.97
పట్టాదారు పేరు (తండ్రి/భర్త పేరు) : ప్రభుత్వము (శ్రీ)
అనుభవదారుని పేరు (తండ్రి/భర్త పేరు) : ప్రభుత్వము (శ్రీ)
అనుభవ స్వభావం : ఖాతీ ఫలం
రిమార్కులు :

రెవెన్యూ రికార్డుల్లో ప్రభుత్వ భూమిగా చూపుతున్న పత్రాలు

పోలీస్ అధికారి బంధువు పేరుతో..

ఆ ఖరీదైన స్థలాన్ని కావలిలో విధులు నిర్వహిస్తున్న ఓ పోలీస్ అధికారి సమీప బంధువు పేరుతో రికార్డులు మార్చేసినట్లు తెలుస్తోంది. నకిలీ పత్రాలు సృష్టించి రిజిస్ట్రేషన్లు కూడా చేయించుకున్నారన్న ఆరోపణలున్నాయి. ప్రధాన రహదారి వెంబడి ఖరీదైన ఆ స్థలాన్ని గత ప్రభుత్వ హయాంలో కాపాడుకుంటూ వచ్చారు. ఎవరి ఆక్రమణలోకి వెళ్లకుండా కాపు కాశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రికార్డులే తారుమారు చేసి స్థలాన్ని కాజేయడంపై కావలి వాసులు మండి పడుతున్నారు. అధికారులు సైతం కళ్ల ముందే దురాక్రమణ జరుగుతున్నా కబ్జాదారులతో కుమ్మక్కై, వారికి తమ వంతు సహకారం అందిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. ఈ దురాక్రమణ విషయంపై కలెక్టర్‌కు ఫిర్యాదు వెళ్లినట్లు తెలుస్తోంది.

న్యూస్‌రీల్

ఆన్‌లైన్‌లో పాలిసెట్ హాల్‌టికెట్లు

నెల్లూరు (టౌన్): పాలిసెట్‌కు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు హాల్ టికెట్లను ఆన్‌లైన్‌లో విడుదల చేసినట్లు ప్రభుత్వ బాలుర పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ రామారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు హాల్ టికెట్లను polycetap. nic. in వెబ్‌సైట్ ద్వారా ఈ నెల 30వ తేదీలోపు ప్రతి ఒక్కరూ డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. పోస్టు ద్వారా ఎవరికి రావన్నారు.

470 పొగాకు బేళ్ల విక్రయం

మర్రిపాడు: మండలంలోని డీసీపల్లి పొగాకు బోర్డు వేలం కేంద్రంలో శుక్రవారం 470 పొగాకు బేళ్లను విక్రయించినట్లు వేలం నిర్వహణాధికారి జీ రాజశేఖర్ తెలిపారు. వేలానికి 643 బేళ్లు రాగా 470 బేళ్లను విక్రయించామని, మిగిలిన బేళ్లను వివిధ కారణాలతో తిరస్కరించినట్లు తెలిపారు. వేలంలో 60487.9 కిలోల పొగాకును విక్రయించగా రూ.15435796.70 వ్యాపారం జరిగింది. కిలో గరిష్ఠ ధర రూ.280 కాగా కనిష్ఠ ధర రూ.215 లభించింది. సగటున రూ.255.19 ధర నమోదైంది. వేలంలో 10 కంపెనీల వ్యాపార ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆర్‌ఐఓగా వరప్రసాద్‌రావు బాధ్యతల స్వీకరణ



ఆర్‌ఐఓగా బాధ్యతలు స్వీకరిస్తున్న వరప్రసాదరావు

నెల్లూరు (టౌన్): ఇంటర్మీయట్ బోర్డు జిల్లా రీజనల్ ఇన్‌స్పెక్షన్ ఆఫీసర్ (ఆర్‌ఐఓ) (ఎఫ్‌ఏసీ)గా టి. వరప్రసాద్‌రావును నియమిస్తూ ఇంటర్మీడియట్ విద్యా మండలి కార్యదర్శి కృతిక శుక్లా ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు ఆయన శుక్రవారం స్టోన్‌హౌస్‌పేటలోని కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. వరప్రసాదరావు ప్రస్తుతం వెంకటాచలం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్‌గా విధులు నిర్వహిస్తున్నారు. గతంలోనూ ఆయన 2021 నుంచి 2022 వరకు ఆర్‌ఐఓగా బాధ్యతలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల ప్రకారం కళాశాలలు నిర్వహించే విధంగా కృషి చేస్తానన్నారు. వచ్చే నెలలో జరగనున్న ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు సజావుగా జరిగేలా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. ఈ సందర్భంగా వరప్రసాదరావును పలువురు కాంట్రాక్ట్ అధ్యాపక అసోసియేషన్ నాయకులు, కార్యాలయ సిబ్బంది మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

28న కందుకూరులో జాబ్‌మేళా

నెల్లూరు (పొగతోట): ఆంధ్రప్రదేశ్ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, ఎంప్లాయిమెంట్ ఆఫీస్, సీడాప్ సంయుక్తంగా ఈ నెల 28న కందుకూరులోని ఎంఆర్‌ఆర్ గవర్నమెంట్ పాలిటెక్నిక్ కళాశాలలో జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి అబ్దుల్ ఖయ్యూం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఈ మేళా జరుగుతుందన్నారు. ప్రముఖ పరిశ్రమల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించి ఎంపిక చేస్తారన్నారు. టెన్త్, ఐటీఐ, డిప్లొమా, ఇంటర్, డిగ్రీ చదివిన నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు 9848050543, 7286822789 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

పింఛన్ దరఖాస్తులు పూర్తిస్థాయిలో పరిశీలించండి



టెలీకాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న పీడీ నాగరాజాకుమారి

నెల్లూరు (పొగతోట): వితంతువులకు పింఛన్ మంజూరు కోసం ప్రభుత్వం అవకాశం ఇచ్చిందని, వచ్చిన దరఖాస్తులను పూర్తి స్థాయిలో పరిశీలించి అప్‌లోడ్ చేయాలని డీఆర్‌డీఏ పీడీ నాగరాజకుమారి ఎంపీడీఓలను ఆదేశించారు. శుక్రవారం డీఆర్‌డీఏ కార్యాలయం నుంచి ఎంపీడీఓలతో నిర్వహించిన టెలీ కాన్ఫరెన్స్‌లో పీడీ మాట్లాడారు. పింఛన్ వస్తూ భర్త మరణిస్తే ఆ పింఛన్‌ను భార్యకు వితంతు పింఛన్‌గా మంజూరు చేసే అవకాశం ఉందన్నారు. అటువంటి పింఛన్ల దరఖాస్తులు మాత్రమే స్వీకరించాలన్నారు. పింఛన్ల పంపిణీ శాతం పెరిగేలా చర్యలు చేపట్టాలన్నారు.

జర్నలిస్టులపై దాడులు అప్రజాస్వామ్యకం



కలెక్టర్ ఆనంద్‌కు వినతిపత్రం అందజేస్తున్న జర్నలిస్టు సంఘాల ఐక్య వేదిక నాయకులు

- కలెక్టర్‌కు జర్నలిస్టుల ఐక్య వేదిక వినతి

నెల్లూరు రూరల్: విధి నిర్వహణలో ఉండే జర్నలిస్టులపై దాడులు చేయడం అప్రజాస్వామ్యక చర్య అని, దాడులు చేసిన వారిని కఠినంగా శిక్షించాలని జర్నలిస్టు సంఘాల ఐక్య వేదిక నాయకులు శుక్రవారం కలెక్టర్ ఓ ఆనంద్‌ను కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు. ఏలూరులోని 'సాక్షి' కార్యాలయంపై దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ తన రౌడీ మూకలతో కలిసి దాడి చేసి కంప్యూటర్లను ధ్వంసం చేయడం ప్రజాస్వామ్యానికి గొడ్డలి పెట్టు అన్నారు. తొలుత కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీయూడబ్ల్యూజే నాయకులు జయప్రకాష్, మస్తాన్‌రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజాస్వామ్యంలో నాలుగో స్తంభంగా ఉండే జర్నలిస్టులపై దాడులు విపరీతం అయ్యాయన్నారు. సాక్షిలో వార్తలు తమకు వ్యతిరేకంగా వచ్చాయని ఆ కార్యాలయంపై దాడి చేయడం పత్రికా స్వేచ్ఛను హరించడమే అని జర్నలిస్టు సంఘాల ఐక్యవేదిక నాయకులు మండిపడ్డారు. వార్తలో వాస్తవం లేకుంటే దానికి వివరణ ఇవ్వాలని, చట్టబద్ధంగా వ్యవహరించాలన్నారు. సమాజంలో ఎవరు తప్పు చేసినా, పొరపాట్లు చేసిన ఎత్తి చూపించడం పత్రికల బాధ్యత అన్నారు. తప్పుడు వార్తలుగా భావిస్తే నిరసన తెలియజేసేందుకు ప్రజాస్వామ్యంలో ఉన్న పద్ధతులను రాజకీయ నాయకులు పాటించాలన్నారు. జర్నలిస్టులపై దాడులు నిరోధించేందుకు ప్రత్యేక చట్టాలు తేవాలని వారు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వంలో ఎవరున్నా ఏ పార్టీ నాయకత్వం వహించినా ప్రజాస్వామ్యంలో పత్రికలపై దాడులు జరిగితే ఏపీయూడబ్ల్యూజే ఖండిస్తుందని, ప్రజాస్వామ్య పద్ధతిలో ఉద్యమిస్తుందన్నారు. ఏలూరు 'సాక్షి' కార్యాలయంపై జరిగిన దాడిని ప్రభుత్వం తీవ్రంగా పరిగణనలోకి తీసుకుని అందుకు బాధ్యులైన వారిని కఠినంగా శిక్షించాలని జర్నలిస్ట్ సంఘాల ఐక్యవేదిక నాయకులు కోరారు.

పారిశ్రామికవేత్తలుగా మహిళలు

నెల్లూరు (పొగతోట): మహిళలను పారిశ్రామికవేత్తలుగా అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు డీఆర్‌డీఏ పీడీ నాగరాజకుమారి తెలిపారు. శుక్రవారం కృషి విజ్ఞాన కేంద్రంలో వర్మీ కంపోస్టుపై నిర్వహించిన శిక్షణలో పీడీ పాల్గొని మాట్లాడారు. మహిళలను 'సంకల్ప పథకం' ద్వారా పారిశ్రామికవేత్తలు తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు పేర్కొన్నారు. వర్మీకంపోస్టు ద్వారా ఆదాయం లభిస్తుందన్నారు. పంటల దిగుబడులు తదితర వాటిపై ప్రత్యేక శిక్షణ ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో కేవీకే ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్ డాక్టర్ శివజ్యోతి, ఏపీఎంలు నాగేంద్ర ప్రసాద్, కిరణ్, స్వయం సహాయక గ్రూపు మహిళలు పాల్గొన్నారు.

స్టేట్ పబ్లిసిటీ వింగ్‌లో జిల్లా నేతల నియామకం

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు జిల్లాకు చెందిన పలువురు నాయకులను రాష్ట్ర అనుబంధ విభాగ కమిటీలో వివిధ హోదాల్లో నియమించారు. అందులో భాగంగా స్టేట్ పబ్లిసిటీ వింగ్ వైస్ ప్రెసిడెంట్‌గా చేజర్ల సుబ్బారెడ్డి, జనరల్ సెక్రటరీగా వంగాల శ్రీనివాసులురెడ్డి, సెక్రటరీలుగా కరేటి దైవాదీనం, బొర్రా సుబ్బిరెడ్డి, జాయింట్ సెక్రటరీలుగా చెరుకూరి బ్రహ్మయ్య, అశోక్‌రెడ్డిలను నియమిస్తూ శుక్రవారం పార్టీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది.

సీఎం పర్యటన ఏర్పాట్ల పరిశీలన



హెలిప్యాడ్ వద్ద అధికారులతో మాట్లాడుతున్న మంత్రి ఆనం

ఆత్మకూరు: ఆత్మకూరు మున్సిపల్ పరిధిలో మే 1న సీఎం చంద్రబాబు పర్యటన నేపథ్యంలో ఏర్పాట్లను మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పరిశీలించారు. శుక్రవారం సాయంత్రం ఆర్డీఓ బి.పావని, మున్సిపల్ కమిషనర్ సి గంగాప్రసాద్, చైర్‌పర్సన్ వెంకటరమణమ్మతో కలిసి బైపాస్ రోడ్డులోని హెలిప్యాడ్ ప్రాంతం, బీసీ బాలికల గురుకుల పాఠశాల, ఎంఎస్ఎంఈ పార్కుల వద్ద ఏర్పాట్లను ఆయన పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. నారంపేట ఎంఎస్ఎంఈ పార్కు వద్ద రోడ్లు, విద్యుత్ సరఫరా, తదితర మౌలిక వసతులను పరిశీలించారు. ఆయన వెంట అన్ని శాఖల అధికారులు, స్థానిక పార్టీ నాయకులు, ఎంపీపీ వేణుగోపాల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కొవ్వొత్తులతో న్యాయవాదుల ప్రదర్శన



కొవ్వొత్తులతో నిరసన ప్రదర్శన నిర్వహిస్తున్న న్యాయవాదులు

నెల్లూరు (లీగల్): కశ్మీర్‌లోని పహల్గామ్‌లో పర్యాటకులపై పాకిస్తాన్ ముష్కరులు సాగించిన ఉన్మాద కాల్పుల్లో మరణించిన వారికి ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, ఉగ్ర చర్యలను నిరసిస్తూ నెల్లూరు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు శుక్రవారం జిల్లా కోర్టు ఆవరణ నుంచి కొవ్వొత్తులతో నగరంలో భారీ ప్రదర్శన నిర్వహించారు. పాకిస్తాన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఏపీ బార్ కౌన్సిల్ సభ్యుడు వేనాటి చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ఇలాంటి దాడులు పునరావృతం కాకుండా కేంద్ర ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. అసోసియేషన్ అధ్యక్షుడు ఉమామహేశ్వరరెడ్డి, ప్రధాన కార్యదర్శి సుందరయ్యయాదవ్ ఆధ్వర్యంలో జరిగిన ప్రదర్శనలో బార్ అసోసియేషన్, జాయింట్ సెక్రటరీ పీవీ వరప్రసాద్, కోశాధికారి దన్నూల్ రమేష్, వీ శ్రీనివాసరావు, అయ్యప్పరెడ్డి, నక్క నాగరాజు కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఎరచ్రందనం కేసులో ఇద్దరికి ఏడాది జైలు

తిరుపతి (లీగల్): ఎర్రచందనం కేసులో ఇద్దరికి ఏడాది శిక్ష విధిస్తూ తిరుపతిలోని ఎర్రచందనం కేసుల విచారణ ప్రత్యేక జూనియర్ జడ్జి కోర్టు జడ్జి ఎస్ శ్రీకాంత్ శుక్రవారం తీర్పు చెప్పారు. నెల్లూరు జిల్లా రాపూరు మండలం గొనుపల్లికి చెందిన చల్ల రమణయ్య, బత్తల రమణయ్య 2014 డిసెంబర్ 26న నెల్లూరు జిల్లా గోనుపల్లి సెక్షన్, రాపూరు వెలుగొండ రిజర్వ్ ఫారెస్ట్ దాసరికోన అటవీ ప్రాంతంలోకి అక్రమంగా ప్రవేశించి 83 కిలోల ఏడు ఎరచ్రందనం దుంగలను నరికి తరలిస్తుండగా అటవీ శాఖాధికారులు పట్టుకున్నారు. కేసులో నిందితులు ఒక్కొక్కరికి ఏడాది జైలు శిక్ష, రూ.5 వేలు చొప్పున జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరపున ఏపీపీ రామ శాంతి వాదించారు.

మరో కేసులో ఒకరికి ఐదేళ్లు..

చిత్తూరు జిల్లా గుడుపల్లి, లెనిన్‌నగర్‌కు చెందిన సెల్వంకు ఐదేళ్లు జైలు శిక్ష, రూ.3 లక్షల జరిమానా విధిస్తూ తిరుపతి ఎరచ్రందనం కేసుల విచారణ ప్రత్యేక సెషన్స్ జడ్జి నరసింహమూర్తి శుక్రవారం తీర్పు చెప్పారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ బాలకృష్ణమనాయుడు వివరాల మేరకు.. 2022 అక్టోబర్ 8న తిరుపతి టాస్క్ ఫోర్స్ సిబ్బంది శేషాచలం రిజర్వ్ ఫారెస్ట్, టీఎన్ పాళ్యం బీట్, తిరుపతి రూరల్ మండలంలో తనిఖీలు నిర్వహిస్తుండగా నిందితుడు సెల్వం మరి కొంతమంది అటవీ ప్రాంతంలో గొడ్డళ్లు, చాకులతో వెళ్తుండగా వారిని విచారించడానికి ప్రయత్నించారు. నిందితుడు సెల్వం పట్టుపడగా మరికొంత మంది పరారయ్యారు. ఫారెస్ట్ సిబ్బంది నిందితుడు సెల్వంను అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచారు. అతనిపై నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి సెల్వంకు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు.

వామ్మో.. ఇదేం ఎండ

ఎండ దెబ్బకు జనం బెంబేలెత్తిపోతున్నారు. రోజురోజుకూ ఉష్ణోగ్రతలు పెరిగిపోతున్నాయి. ఉక్కపోతకు ప్రతిఒక్కరూ అల్లాడిపోతున్న పరిస్థితులున్నాయి. దీంతో రోడ్లపై రాకపోకలు సాగించే వారు తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు



ఎండకు తట్టుకోలేక..



జ్యూస్ తాగుతూ..



ఈ మాత్రం జాగ్రత్తలు తప్పవు మరి..



సన్‌గ్లాస్



నెల్లూరులో హైవేపై ఎండమావులు



టవల్ కప్పుకొని వెళ్లాల్సిందే..

క్లుప్తంగా

రెండు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల చోరీ



ట్రాన్స్‌ఫార్మర్‌ను చోరీ చేసింది ఇక్కడి నుంచే..

తోటపల్లిగూడూరు: మండలంలోని కోడూరు పంచాయతీ మహాలక్ష్మీపురం గ్రామంలో పొలాల్లో అమర్చిన రెండు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను చోరీ చేసిన ఘటన శుక్రవారం వెలుగు చూసింది. పోలీసులు, స్థానికుల కథనం మేరకు.. గ్రామంలో విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలో రైతులకు సంబంధించి పొలాలకు విద్యుత్ సరఫరాకు కొన్నేళ్ల క్రితం ట్రాన్స్‌కో రెండు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేసింది. దీని వల్ల సుమారు 50 ఎకరాలకు నీటి సరఫరా జరుగుతోంది. రెండురోజుల క్రితం గుర్తుతెలియని వ్యక్తులు రాత్రి సమయంలో ఒక విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను పూర్తిగా చోరీ చేశారు. మరో దానిని పగులగొట్టి రాగివైరును ఎత్తుకెళ్లారు. దీనిని గుర్తించిన స్థానిక రైతులు కోడూరు విద్యుత్ సబ్‌స్టేషన్ ఏఈ ప్రతాప్‌కు సమాచారం అందించారు. ఏఈ శుక్రవారం ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు తెలుసుకున్నారు. చోరీ సొత్తు విలువ రూ.లక్షకు పైగా ఉంటుందని తెలిపారు. ఆయన తోటపల్లిగూడూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

సబ్ ట్రెజరీ భవనాన్ని త్వరలో ప్రారంభిస్తాం



రికార్డులను పరిశీలిస్తున్న డీడీ గంగాద్రి

రాపూరు: జిల్లా కేంద్రమైన నెల్లూరులో నూతన సబ్ ట్రెజరీ భవనాన్ని త్వరలో ప్రారంభిస్తామని జిల్లా ఖజానా కార్యాలయ డిప్యూటీ డైరెక్టర్ డి.గంగాద్రి తెలిపారు. రాపూరులోని సబ్ ట్రెజరీ కార్యాలయాన్ని ఆయన శుక్రవారం తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అలాగే కావలి, ఆత్మకూరు, వింజమూరు, ఉదయగిరి ప్రాంతాల్లో కూడా నూతన భవనాలు పూర్తయినట్లు వెల్లడించారు. కోవూరులో నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయని, బుచ్చిరెడ్డిపాళెంలో స్థల పరిశీలన జరుగుతోందన్నారు. పొదలకూరులో రీటెండర్లు జరిపి నిర్మాణాన్ని చేపడతామన్నారు. సిబ్బందికి పలు సూచనలిచ్చారు. ఆయన వెంట ఉపఖజానాధికారి అబ్దుల్ అలీమ్, సిబ్బంది వెంకటకృష్ణ, అమీర్‌బాషా, సుబ్బరాయులు, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

యువకుడిపై పోక్సో కేసు

దొరవారిసత్రం: బాలికతో అసభ్యంగా ప్రవర్తించిన అందలమాల శివ అనే యువకుడిపై పోలీసులు పోక్సో యాక్ట్ కింద గురువారం రాత్రి కేసు నమోదు చేయగా శుక్రవారం వెలుగులోకి వచ్చింది. వారి కథనం మేరకు.. మండలంలోని కట్టువాపల్లిలో బంధువుల ఇంటికి నెల్లూరు నుంచి ఓ బాలిక వచ్చింది. ఆమెతో గ్రామానికి చెందిన శివ మూడు రోజుల క్రితం అసభ్యకరంగా ప్రవర్తించాడు. దీనిపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో బాలిక సమీప బంధువులు ఫిర్యాదు చేశారు. ఎస్సై అజయ్ కుమార్ యువకుడిపై పోక్సో యాక్ట్ కింద కేసు నమోదు చేశారు. అతడిని అరెస్ట్ చేసి అదుపులోకి తీసుకున్నారు.

కండలేరులో నీటి నిల్వ

రాపూరు: కండలేరు జలాశయంలో శుక్రవారం నాటికి 45.541 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. సత్యసాయి గంగ కాలువకు 330, పిన్నేరు కాలువకు 5, లోలెవల్ కాలువకు 50, హైలెవల్ కాలువకు 30, మొదటి బ్రాంచ్ కాలువకు పది క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు వెల్లడించారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్) : 110
లేయర్ (లైవ్) : 100
బ్రాయిలర్ చికెన్ : 200
బ్రాయిలర్ స్కిన్‌లెస్ : 220
లేయర్ చికెన్ : 170



నిమ్మ ధరలు (కిలో)

పెద్దవి : రూ.85
సన్నవి : రూ.65
పండ్లు : రూ.35



సమగ్రశిక్ష.. పట్టించుకునే దిక్కేది!

తీవ్రంగా వేధిస్తున్న సిబ్బంది కొరత

- రెగ్యులర్ ఈఈ, నలుగురు డీఈల పోస్టులు ఖాళీ
- ఐఈ కో–ఆర్డినేటర్, ఏఎల్ఎస్, ఏఎంఓ, ఏఎస్ఓలు కూడా..
- ఆ శాఖ పర్యవేక్షణలోనే నాడు – నేడు పనులు
- ఇంకా పట్టు సాధించని ఏపీసీ

విద్యాశాఖలో ఎంతో కీలకమైన సమగ్రశిక్షలో పాలన అస్తవ్యస్తంగా మారింది. సిబ్బంది కొరత ఆ శాఖను పట్టిపీడిస్తోంది. నాడు – నేడు నుంచి రకరకాల శిక్షణల వరకు దాని ఆధ్వర్యంలోనే జరుగుతుంటాయి. ఇంకా భవిత, ప్రత్యామ్నాయ స్కూల్స్, కేజీబీవీలు తదితరాల కార్యకలాపాలను పర్యవేక్షిస్తుంటుంది. అయితే ఆ శాఖలో ప్రధాన విభాగాల్లోని పోస్టులన్నీ ఖాళీగా దర్శనమిస్తున్నాయి.

నెల్లూరు(టౌన్): కూటమి ప్రభుత్వం విద్యాశాఖను గాలికొదిలేసింది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో మనబడి నాడు – నేడు పనులు చాలా వరకూ శరవేగంగా జరిగాయి. చంద్రబాబు సర్కారు పట్టించుకోకపోవడంతో అవి అసంపూర్తిగానే ఉన్నాయి. నాడు – నేడుకు సంబంధించి ఒక్కపైసా కూడా నిధులు విడుదల చేసిన పరిస్థితి లేదు. పైగా సమగ్రశిక్షలో ఖాళీ పోస్టుల భర్తీపై కూడా దృష్టి సారించకపోవడం విమర్శలకు తావిస్తోంది. ఏపీసీగా వెంకటసుబ్బయ్య మూడు నెలల క్రితం బాధ్యతలు స్వీకరించారు. ఇంకా ఆయన ఈ శాఖపై పట్టు సాధించలేదని ప్రచారం ఉంది. ఈ నేపథ్యంలో ఉద్యోగులు ఎవరికి వారే యమునా తీరే అన్న చందంగా మారారు.

మెజార్టీ పోస్టుల ఖాళీ

సమగ్రశిక్షలో మెజార్టీ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇక్కడ ఇంజినీరింగ్ విభాగం ప్రధాన పాత్ర పోషిస్తుంటుంది. అయితే అక్కడ సిబ్బంది లేని పరిస్థితి. రెగ్యులర్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఉండాల్సి ఉండగా ఎఫ్ఏసీపై ఆయన రెండు చోట్ల పనిచేస్తున్నారు. నలుగురు రెగ్యులర్ డివిజనల్ ఇంజినీర్లకు గానూ ఒకరు కూడా లేరు. కనీసం డిప్యూటేషన్‌పై ఇతర శాఖల నుంచి ఒకరినైనా ఇక్కడికి పంపించలేదు. ఏఈలు పూర్తి స్థాయిలో ఉన్నా వారిని పర్యవేక్షించే వారు లేకపోవడంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. అదే విధంగా జిల్లాలోని భవిత కేంద్రాలను పర్యవేక్షించాల్సిన ఐఈ కో–ఆర్డినేటర్ పోస్టు ఏడాది కాలంగా ఖాళీగా ఉంది. దీనిని గర్ల్ చైల్డ్ డెవలప్‌మెంట్ అధికారి మమతకు అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈమె రెండు విభాగాల్లో పర్యవేక్షించలేని పరిస్థితి ఉండటంతో భవిత కేంద్రాల నిర్వహణ దారుణంగా మారింది. బడి బయట పిల్లల కోసం ఏర్పాటు చేసిన ప్రత్యామ్నాయ స్కూల్స్‌ను పర్యవేక్షించాల్సిన ఏఎల్ఎస్ పోస్టు 6 నెలలుగా ఖాళీగా ఉంది. దీనికి సంబంధించి సీఓంఓకు అదనపు బాధ్యతలు అప్పగించారు. ఇంకా ఏఎస్ఓ, ఎంఐఎస్ ప్లానింగ్ కో–ఆర్డినేటర్, ఉర్దూ ఏఎంఓ పోస్టులు ఖాళీగా ఉన్నాయి.



జిల్లా సమగ్రశిక్ష కార్యాలయం

పర్యవేక్షణ అంతంతమాత్రమే..

పోస్టులు ఖాళీగా ఉండటంతో ఆయా విభాగాలపై పర్యవేక్షణ అంతంతమాత్రంగానే ఉందనే విమర్శలున్నాయి. ఏపీసీ ప్రధానంగా నాడు – నేడు, కేజీబీవీ, భవిత, ఆల్టర్నేటివ్ స్కూల్స్ తదితర విభాగాలను నిత్యం పర్యవేక్షించాల్సి ఉంటుంది. జిల్లాలో వైఎస్సార్‌సీపీ హయాంలో రెండో విడత కింద 1,356 ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీలు, డైట్, బీఈడీ కళాశాలల్లో నాడు – నేడు పనులు మొదలుపెట్టారు. నిధులు మంజూరు కాగా 70 శాతం పనులు పూర్తయ్యాయి. ఆ తర్వాత దీని గురించి పట్టించుకునే నాథుడే లేకుండా పోయాడు. జిల్లా ఉన్నతాధికారులు ఈ శాఖపై దృష్టి సారించి సిబ్బందిని నియమించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

కలెక్టర్ అనుమతితో నియామకాలు

సమగ్రశిక్షలో ఖాళీ పోస్టుల్లో సిబ్బందిని నియమించేందుకు కలెక్టర్‌ను అనుమతి కోరుతాం. ఇందుకు సంబంధించి ఫైల్‌ను సిద్ధం చేశాం. ఆయన నుంచి అనుమతి వచ్చిన తర్వాత అన్ని ఖాళీ పోస్టుల్లో సిబ్బంది నియమిస్తాం. అప్పటి వరకు ఇబ్బంది లేకుండా అన్ని విభాగాలను పర్యవేక్షించేలా చర్యలు తీసుకుంటాం.

– వెంకటసుబ్బయ్య, ఏపీసీ, సమగ్రశిక్ష



విద్యాశాఖలో ముగిసిన డెప్యుటేషన్

- పలువురు ఉపాధ్యాయుల రిలీవ్

నెల్లూరు(టౌన్): జిల్లా విద్యాశాఖలో డెప్యుటేషన్‌పై వచ్చిన పలువురు ఉపాధ్యాయుల గడువు ముగియడంతో ఉన్నతాధికారులు రిలీవ్ చేశారు. డెప్యుటేషన్‌పై పనిచేస్తున్న వారందరిని వెంటనే రిలీవ్ చేయాలని రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ ఆదేశించింది. ఈ నేపథ్యంలో స్థానిక అధికారులు చర్యలు చేపట్టారు. సమగ్రశిక్ష శాఖలో నలుగురు ఉపాధ్యాయులు, జిల్లా సైన్స్ సెంటర్‌లో నలుగురు, డిస్ట్రిక్ట్ కామన్ ఎగ్జామినేషన్ విభాగంలో 8 మంది, విద్యాశాఖ కార్యాలయంలో ఆరుగురు టీచర్లను రిలీవ్ చేశారు. వీరందరూ ఈనెల 23న ఆయా పాఠశాలల్లో రిపోర్ట్ చేశారు. వీరితోపాటు గతేడాది సెప్టెంబర్‌లో జిల్లా వ్యాప్తంగా 545 మంది సబ్జెక్ట్ ఉపాధ్యాయులను కొరత ఉన్న పాఠశాలలకు డెప్యుటేషన్‌పై పంపించారు. వీరంతా ఆ పాఠశాలల్లో రిలీవై పోస్టింగ్ ఉన్న చోట్ల రిపోర్ట్ చేశారు. వచ్చేనెలలో ఉపాధ్యాయులకు బదిలీలు జరుగనున్న నేపథ్యంలో డెప్యుటేషన్‌పై ఉన్న ఉపాధ్యాయులందరూ పోస్టింగ్ ఉన్న పాఠశాలల్లో రిపోర్ట్ చేయాల్సి ఉంది.

28న ఉద్యోగుల భవిష్యనిధి సమావేశం

నెల్లూరు(బృందావనం): ఈనెల 28వ తేదీన కడనూతల వద్దనున్న ఆర్ఎస్ఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో ఉద్యోగుల భవిష్యనిధి సమావేశం జరుగుతుందని ఎంప్లాయీస్ ప్రావిడెంట్‌ఫండ్ ఆర్గనైజేషన్ డిస్ట్రిక్ట్ ఎన్ఫోర్స్‌మెంట్ ఆఫీసర్ ముప్పవరపు సురేష్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారుల సమస్యల పరిష్కారానికి సమావేశం ఏర్పాటు చేశామని వెల్లడించారు.

రేషన్ ఇవ్వలేదని మహిళల నిరసన



రేషన్‌కార్డులతో నిరసన తెలుపుతున్న మహిళలు

కొండాపురం: ఈనెలకు సంబంధించిన రేషన్‌ను ఇంతవరకు ఇవ్వలేదని మండలంలోని వెలిగండ్ల, చింతలదేవి పంచాయతీల్లోని బసిరెడ్డిపల్లి, బగాదిపల్లి గ్రామాలకు చెందిన కొందరు మహిళలు వాపోయారు. బసిరెడ్డిపల్లిలో వారు శుక్రవారం నిరసన తెలిపి మాట్లాడారు. షాపు నంబర్‌లో 20 నుంచి ప్రతి నెలా తమకు వెహికల్ ద్వారా రేషన్ బియ్యం అందించేవారన్నారు. ఏప్రిల్ నెలాఖరు వస్తున్నా 84 మంది కార్డుదారులకు రేషన్ ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. డీలర్‌ను అడిగితే సరైన సమాధానం చెప్పడం లేదన్నారు. తమకు బియ్యం ఇవ్వడం ఎందుకు నిలిపేశారో అర్థం కావడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రెవెన్యూ అధికారులను అడిగితే సరైన సమాధానం రావడం లేదని వాపోయారు. అధికారులు స్పందించి బియ్యం అందించాలని కోరారు. ఈ విషయమై తహసీల్దార్ కోటేశ్వర రావు మాట్లాడుతూ మండలంలోని అన్ని రేషన్ షాపులకు సంబంధించి ఈ నెలలో బియ్యం తక్కువగా వచ్చిందన్నారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని, నెలాఖరులోగా ప్రతి లబ్ధిదారుకు బియ్యం అందిస్తామని తెలిపారు.

హాస్టల్ విద్యార్థులకు కలెక్టర్ ప్రశంసలు



ప్రతిభ చూపిన విద్యార్థులతో కలెక్టర్ ఆనంద్

నెల్లూరు రూరల్: ఇంటర్మీడియట్, పదో తరగతి పరీక్షల ఫలితాల్లో ప్రతిభ చూపిన జిల్లాలోని ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్ల విద్యార్థులకు కలెక్టర్ ఒ.ఆనంద్ జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలను అందజేశారు. నెల్లూరు సాంఘిక సంక్షేమ కేంద్ర ప్రభుత్వ హాస్టల్ విద్యార్థిని యాదల సంగీత ఇంటర్మీడియట్ రెండో సంవత్సరం ఎంపీసీలో 961 మార్కులు, బద్దిపూడి మేఘన సీఈసీలో 927 మార్కులు సాధించారు. పదో తరగతిలో వింజమూరు సాంఘిక సంక్షేమ బాలికల హాస్టల్ విద్యార్థిని ఎ.నందిని 574 మార్కులు, ఉలవపాడు సాంఘిక సంక్షేమ బాలికల హాస్టల్ విద్యార్థిని ఎన్.కాజోల్ లక్ష్మీ అగర్వాల్ 568 మార్కులు, ఆత్మకూరు సాంఘిక సంక్షేమ బాలుర హాస్టల్ విద్యార్థి ఒంటేరు సాయిధనుష్ 565 మార్కులు సాధించారు. వారిని శుక్రవారం నెల్లూరులోని తన కార్యాలయంలో కలెక్టర్ అభినందించారు. ఈ సందర్భంగా ఆనంద్ మాట్లాడుతూ బాగా చదువుకుని జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జిల్లా సాంఘిక సంక్షేమ సాధికారత అధికారిణి శోభారాణి పాల్గొన్నారు.

అదనంగా నగదు వసూలు చేయొద్దు

- జేసీ కార్తీక్



మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ కార్తీక్

నెల్లూరు(అర్బన్): గ్యాస్ సిలిండర్‌కు ప్రభుత్వం నిర్ణయించిన ధర కన్నా వినియోగదారుల నుంచి డెలివరీ బాయ్స్ అదనంగా వసూలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జాయింట్ కలెక్టర్ కార్తీక్ హెచ్చరించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని తన కార్యాలయంలో గ్యాస్ ఏజెన్సీల నిర్వాహకులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినియోగదారుల నుంచి అదనంగా వసూలు చేసినట్టు వస్తున్న ఫిర్యాదులపై స్పందించని ఏజెన్సీలపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. గ్యాస్ బుకింగ్ చేసిన వెంటనే వారికి సకాలంలో సిలిండర్ డెలివరీ చేయాలని సూచించారు. వినియోగదారులందరూ సంబంధిత గ్యాస్ ఏజెన్సీల్లో ఈకేవైసీ పూర్తి చేయించుకోవాలని కోరారు. అనంతరం ఐవీఆర్ఎస్ సర్వే గురించి సమీక్షించారు. కార్యక్రమంలో డీఎస్ఓ విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయ దిగ్బంధం

సైదాపురం: మండలంలోని ఊటుకూరు దళితులపై పెట్టిన అక్రమ కేసులు వెంటనే ఎత్తివేయాలని అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా కన్వీనర్ డీపీ పోలయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం దళితులు తహసీల్దార్ కార్యాలయాన్ని దిగ్బంధించారు. ఆయన మాట్లాడుతూ ఊటుకూరు సమీపంలో సర్వే నంబర్ 359, 356లో ఉన్న భూమిని భూస్వాములు, పెత్తందారులు ఆక్రమించుకున్నారని ఆరోపించారు. వాటిని సర్వే చేసి స్వాధీనం చేసుకుని పేదలకు పంచి పెట్టాలన్నారు. ఈ విషయమై కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆందోళన చేశామన్నారు. జిల్లా ఉన్నతాధికారులు కూడా పేదలకు న్యాయం చేయాలని ఆదేశించారని తెలిపారు. స్థానిక రెవెన్యూ అధికారులు మైనింగ్ మాఫియాతో కుమ్మక్కై దళితులపై కేసులు పెట్టారని దుయ్యబట్టారు. భూస్వాముల ఆధీనంలో ఉన్న భూములను స్వాధీనం చేసుకోవడంతోపాటు బంజరు భూములను నిరుపేదలకు ఇచ్చి పట్టాలు ఇవ్వాలని కోరారు. తహసీల్దార్ రమాదేవి ఆదేశాల మేరకు ఎస్ఐ క్రాంతికుమార్, పోలీసులు అక్కడికి చేరుకుని ఆందోళనకారులకు సర్దిచెప్పారు. కార్యక్రమంలో రమేష్, వెంకటయ్య, మమత, కోటయ్య, అంకయ్య తదితరులు పాల్గొన్నారు.

- అనుమతి లేకుండా తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేయడంతోపాటు రోడ్డుపై వాహనాలను నిలిపి వేసినందుకు అఖిల భారత రైతు కూలీ సంఘం నేతలు, ఆందోళనకారులపై రెండు కేసులు నమోదు చేసినట్లు ఎస్సై క్రాంతికుమార్ తెలిపారు.